www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | బుధ వారం 15 జూన్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-88 | పేజీలు - 4 వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# బాసర త్రిబుల్‌ఐటీ ట్రబుల్

## ఉన్నత చదువుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

## ఆందోళన బాటలో 8000 మంది విద్యార్థులు



"ముఖ్యమంత్రి కేసీఆర్ యూనివర్సిటీని సందర్శించే వరకు ధర్నా ఆపేది లేదు. క్యాంపస్‌కు రెగ్యులర్ వైస్ చాన్సలర్‌ను నియమించాలి, పర్మినెంట్ ఉద్యోగ నియామకాలు చేపట్టాలి, విద్యార్థులకు ల్యాప్‌టాప్, యూనిఫామ్ అందించాలని డిమాండ్"

గొడుగుల సహాయంతో నడి ఎండలో కూర్చొని బాసరా త్రిబుల్ ఐటీ విద్యార్థుల ధర్నా

### కేసీఆర్ ప్రభుత్వానికి ఏదీ..! చిత్తశుద్ధి

**పేద, బడుగు బలహీన వర్గాల పిల్లల ఉన్నత చదువుల పట్ల కేసీఆర్ ప్రభుత్వం అక్కస్సు ఎల్లగక్కుతుంది. కేజీ టూ పీజీ అని ప్రగల్భాలు పలుకుతూ ఊదరగొట్టే టీఆర్ఎస్ ప్రభుత్వ అసలు రంగు బాసర త్రిబుల్‌ఐటీ క్యాంపస్‌లో బయటపడింది. ఎటు చూసిన నిర్లక్ష్యం, అరకోర వసతులు, పురుగుల అన్నంతో విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తూ విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతుంది.**

- అకడమిక్ బ్లాక్ ఎదుట విద్యార్థులు రాత్రి వరకు ధర్నా
- భారీగా మోహరించిన పోలీసులు, క్యాంపస్‌లో ఉద్రిక్తత పరిస్థితులు
- తల్లిదండ్రులను, మీడియాను, నేతలను అనుమతించని వైనం
- క్యాంపస్‌లోకి దూకిన బల్మూరీ వెంకట్, ఆరెస్టు చేసిన పోలీసులు

**నిర్మల్, జూన్ 14 (సమ సమాజం డెస్క్):** నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు కదం తొక్కారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన బాట పట్టారు. నిత్యం సమస్యలతో విసిగి వేసారిపోయామని.. ఎన్ని సార్లు చెప్పిన అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటీ ప్రధాన కార్యాలయం ముందు 8 వేల మంది బైఠాయించి 'వి వాంట్ జస్టిస్..' అంటూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ యూనివర్సిటీని సందర్శించే వరకు ధర్నా ఆపేది లేదని విద్యార్థులు అన్నారు. క్యాంపస్‌కు రెగ్యులర్ వైస్ చాన్సలర్‌ను నియమించాలని, పర్మినెంట్ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, విద్యార్థులకు ల్యాప్‌టాప్ యూనిఫామ్ అందించాలని డిమాండ్ చేశారు. అలాగే తాగునీటితో పాటు తాము ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆందోళన చేపట్టారు. విద్యార్థులు ఆందోళన విషయం బయటకు తెలియకుండా ఉండేందుకు క్యాంపస్ ఆవరణలో ఇంటర్నెట్ సేవలు నిలిపేశారు. మీడియాను లోపలికి అనుమతించకపోవడం.. రకరకాల విమర్శలకు తావిస్తుంది. విద్యార్థులకు మద్దతుగా బీఎస్పీ నాయకులు మద్దతు ఇస్తూ కళాశాల వద్దకు చేరుకొని గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో విద్యార్థి నాయకుడు బల్మూరీ వెంకట్ క్యాంపస్ గోడ దూకి ఆందోళన చేపట్టాడు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా అక్కడ భారీ ఎత్తున పోలీసులు మోహరించారు.

## ఉద్యమం నాటి కెసిఆర్ కాదు

- నేడు టీవీల్లో కనిపిస్తే ప్రజల ఛీత్కారం
- తాను పార్టీ మారలేదు..వారే వెళ్లగొట్టారు
- 5 లక్షలకోట్లు అప్పు చేసినా జీతాల్లేవు
- సిద్దిపేట సభలో నిప్పులు చెరిగిన ఈటెల



**సిద్దిపేట, జూన్ 14 (సమ సమాజం):** ఉద్యమం నాటి కేసీఆర్ కు.. ఇప్పటి కేసీఆర్‌కు చాలా తేడా ఉందని హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండాభూదేవి గాడ్గన్‌లో నిర్వహించిన ప్రధాని మోదీ 8 ఏళ్ళ ప్రజా సంక్షేమ పాలన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ ఒకప్పుడు కేసీఆర్ టీవీలో కనబడితే యువత కేరింతలు కొట్టేవారని.. ఇప్పుడు చీదరించుకుంటున్నారని అన్నారు. తాను పార్టీ మారలేదని, టీఆర్ఎస్ వాళ్ళే వెళ్లగొట్టారన్నారు. రెచ్చగొడితే ఆత్మగౌరవం కోసం రాజీనామా చేశానని స్పష్టం చేశారు. రాష్ట్ర సమస్యలపై చర్చకు సిద్ధమని అన్నారు. కాషాయ జెండా తెలంగాణ గడ్డ మీద ఎగరాలని చాలామంది ఎదురు చూస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరాలని చాలా మంది ఎదురుచూస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల

2వ

## కెసిఆర్ ట్రాప్‌లో ఉండవల్లి

### వీరి భేటీపై ఘాటుగా స్పందించిన రేవంత్



**హైదరాబాద్, జూన్ 14 (సమ సమాజం):** ట్రాప్‌లో మాజీఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ పడ్డారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఉండవల్లి అంటే.. సమైక్యాంధ్ర సిద్ధాంతం కోసం పోరాడారనే గౌరవం ఉండేదని.. కేసీఆర్‌తో భేటీ తర్వాత అదికాస్త పోయిందన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, సీఎం కేసీఆర్ భేటిపై రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ బీజేపీపై పోరాడితే..కేసీఆర్ చేసిన అవినీతి పై బీజేపీ ఎందుకు విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర విభజనపై ఉండవల్లి రాసిన రెండు పుస్తకాలలో తెలంగాణ ఏర్పాటునే తప్పు బట్టారు. తెలంగాణ కోసం పోరాడిన కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి , పొన్నం ప్రభాకర్‌ను విమర్శించారు. అలాంటి వ్యక్తిని కేసీఆర్ ఇంటికి పిలిచి మాట్లాడారు. సార పాతదే..సీసా కొత్తది అన్నట్లు.. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మారుస్తారట.. కేసీఆర్ పక్కన ఉన్న వాళ్లంతా..బీహార్ వాళ్లే.. టీఆర్ఎస్ కాదు.. అది బీహార్ పార్టీ..తెలంగాణను వ్యతిరేకించిన ఉండవల్లిని కేసీఆర్ దగ్గరకు తీస్తే..తెలంగాణ సమాజం ఊరుకోదని అన్నారు.

2వ

## రసవత్తరంగా రాష్ట్రపతి ఎన్నికలు

- నేటి మమత భేటీకి హాజరు కానున్న కాంగ్రెస్, లెఫ్ట్
- మమత ఏకపక్ష నిర్ణయాలపై సీతారం ఏచూరి అసహనం
- పవార్‌తో విడివిడిగా చర్చించిన లెఫ్ట్ నేతలు, మమతా బెనర్జీ

**న్యూఢిల్లీ, జూన్ 14 (సమ సమాజం):** రాష్ట్రపతి ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారింది. బుధవారం బంగాల్ సీఎం మమతా బెనర్జీ నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు నిర్ణయించాయి. ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌ను రాష్ట్రపతి ఉమ్మడి అభ్యర్థిగా రంగంలోకి దింపేందుకు ప్రతిపక్షాలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే పవార్ మాత్రం ఒప్పుకోవట్లేదు. మమత ఆధ్వరంలో జరిగే భాజపాయేతర పార్టీల సమావేశంలో ఉమ్మడి అభ్యర్థిగా నిలబడేందుకు కొత్త పేరును తెరపైకి తేస్తారా అన్నది బుధవారం నాటి సమావేశంలో చర్చకురానుంది. రాష్ట్రపతి ఎన్నికలు రాజకీయ హీట్‌ను పెంచేశాయి. భాజపాను ఢీకొట్టేందుకు ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయి. నిన్నటి వరకు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్న విపక్షాలు.. మంగళవారం స్వరాన్ని కాస్త మారినట్లు కనిపిస్తోంది. బుధవారం బంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలో జరగనున్న సమావేశానికి కాంగ్రెస్ మిత్రపక్షాలు సహా ఇతర విపక్షాలు కూడా హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నాయి.



ఉమ్మడి అభ్యర్థిగా ఎన్సీపీ అధినేత శరద్ పవార్ రంగంలోకి దించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. ఘాష్ట్రపతి ఉమ్మడి అభ్యర్థి కోసం.. భాజపాయేతర పార్టీలతో వేదికను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధినేత్రి సోనియా ప్రతిపక్షాలకు లేఖ రాశారు. అది జరిగిన కొద్ది సేపటికే బంగాల్? సీఎం మమతా బెనర్జీ సైతం.. ఈ నెల 15న నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని విపక్ష నేతలకు లేఖ రాసింది. దీంతో లెఫ్ట్ పార్టీలతో పాటు కాంగ్రెస్ మిత్ర పక్షాలు తృణమూల్ అధినేత్రి చర్యను తప్పు పట్టారు. ఏకపక్ష నిర్ణయం అంటూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు. దీదీ వ్యవహారం.. భాజపాకు లాభం కలిగించే విధంగా ఉందంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. మమత సమావేశానికి హాజరు కాబోము అంటూ తేల్చి చెప్పారు.అయితే మంగళవారం విపక్షాలు కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. ప్రతిపక్షాల్లో చీలిక వస్తే.. అధికార పార్టీకి లాభం జరుగుతుందనే ఉద్దేశంతో.. ఆయా పార్టీలు పునరాలోచనలో పడినట్లు

2వ

## రెండో రోజు ఈడీ విచారణకు రాహుల్



- ఎఐసిసి కార్యాలయం వద్ద భారీగా కాంగ్రెస్ శ్రేణులు
- పోలీసులుతో వాగ్వాదానికి దిగిన కార్యకర్తలు
- పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ప్రధాన ప్రాంతాల్లో భారీగా పోలీసుల మొహరింపు

**న్యూఢిల్లీ, జూన్ 14 (సమ సమాజం):** నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ విచారణ రెండోరోజూ కొనసాగుతోంది. రెండోరోజు ఈడీ అధికారులు రాహుల్ గాంధీని ప్రశ్నించారు. ముందుగా ప్రియాంకతో కలసి ఎఐసిసి ఆఫీస్ కు వచ్చిన రాహుల్... ఆ తర్వాత ఈడీ కార్యాలయానికి వెళ్లారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ రాహుల్ వెంట ఉన్నారు. సీపీఆర్ఎఫ్ ఎస్కార్ట్ సెక్యూరిటీతో ఈడీ కార్యాలయానికి రాహుల్ గాంధీ వెళ్లారు .దీంతో ఏఐసీసీ ప్రధాన కార్యాలయం దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ముఖ్య నేతలనే ఏఐసీసీ కార్యాలయంలోకి పోలీసులు అనుమతించారు.

2వ

## రక్తదానాన్ని పండగలా జరపాలి

### రాజ్‌భవన్‌లో రక్తాదాన దినోత్సవంలో గవర్నర్ తమిళసై



**హైదరాబాద్, జూన్ 14 (సమ సమాజం):** రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాజ్ భవన్ లోని సంస్కృతి హాల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రతి రక్తపు బొట్టు ఒక వ్యక్తిని కాపాడుతుందన్నారు. బోనాలు, బతకమ్మ, దివాళి పండుగలాగేనే ఈ రోజు కూడా ఒక పండగల జరుపుకోవాలన్నారు. ఎవరికి సహాయం చేస్తున్నామో తెలియకుండా చేసే

2వ

## పుట్టిన రోజును రక్తదానంతో జరుపుకోండి

### ప్రజాప్రతినిధులకు మంత్రి హరీష్ రావు పిలుపు



**హైదరాబాద్, జూన్ 14 (సమ సమాజం):** రక్తదానంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని మంత్రి హరీష్ రావు పిలుపునిచ్చారు. నేతల పుట్టిన రోజున బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. రక్త దానం చేసినా వ్యక్తులు బలహీనంకారని..దానం చేసిన రక్తాన్ని 24 నుంచి 48 గంటల్లోనే తిరిగి శరీరం ఉత్పత్తి చేస్తుందని వివరించారు. విరివిగా రక్తదానం చేసిన వారిని గుర్తించి సన్మానం చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరల్డ్ బ్లడ్ డోనేషన్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డిలు రక్తదానంలో కీలక పాత్ర పోషిస్తున్నారని..వారి పుట్టిన రోజుల నాడు పెద్ద ఎత్తున బ్లడ్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఏటా 4 లక్షల యూనిట్ల రక్తం అవసరమైతే 3 లక్షల 7 వేల యూనిట్ల రక్తం మాత్రమే సేకరించగలుగుతున్నామని

2వ

## భూనిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వాలి



**హైదరాబాద్, జూన్ 14 (సమ సమాజం):** గౌరవెల్లి భూనిర్వాసితులకు ఆప్ తెలంగాణ అండగా ఉంటుంది భూములు కోల్పోయిన వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం R&R ప్యాకేజీ, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం ఈరోజు వారిపై జరిగిన దాడిని ఖండిస్తున్నాను. పద్దెనిమిది వందల ఎకరాల భూసేకరణ చేసిన ప్రభుత్వం భూనిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వకుండా వారిపై లాఠీ ఛార్జ్ చేయడం ఇదెక్కడి న్యాయం పుట్టిన ఊరు చెట్టు చేమ అన్ని వదులుకొని త్యాగం చేస్తే ప్రభుత్వం వారికి ఇచ్చేది ఈ ప్రతిఫలమా? 18 సంవత్సరాల వయస్సు నిండిన వారికి కూడా నష్టపరిహారం ఇవ్వాలి. ఉద్యోగం మరియు ఇల్లునునిర్మించి ఇవ్వాలి. మల్లన్నసాగర్ భూనిర్వాసితుల ఏవిధంగా ఇచ్చారో

3వ

## సంపాదకీయం

# రాష్ట్రపతిగా
## ఏకగ్రీవ అభ్యర్థిపై చర్చ జరిగేనా !

రాష్ట్రపతి అభ్యర్థి ఎవరన్నది ఇంకా తేలలేదు. విపక్షాల తరపున ఎవరు ఉంటారో అన్నది కూడా ఇంకా స్పష్టత లేదు. ఇప్పటికే శరద్ పవార్ పేరు బయటకు వచ్చినా ఆయన కూడా పెద్దగా క్లీన్ ఇమేజ్ ఉన్న నేత ఏమీ కాదు. ఇకపోతే విపక్షాలతో బుధవారం ఢిల్లీలో సమావేశమై ఉమ్మడి అభ్యర్థి ఎంపికపై చర్చించేం దుకు బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సిద్దమవుతున్నారు. బుధవారం ఢిల్లీ వేదికగా జరిగే ఈ భేటీలో ఎవరెవరు పాల్గొంటారన్నది తెలియదు. అలాగే మమతా బెనర్జీ ఏ మేరకు ఇతర పార్టీలను కలుపుకుని పోతారన్నది కూడా తెలియదు. ఉమ్మడి అభ్యర్థి ప్రతిపాదనకూడా రావడం లేదు. తానే ప్రధాని పదవికి అర్హురాలననే ఆమె అహంభావంతో ఉన్నారు. మోడీకి తానే ప్రయత్నామ్నాయం అని ప్రచారం చేసుకుంటు న్నారు. తెలంగాణ సిఎం కెసిఆర్ కూడా ఇదే ధోరణితో ఉన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయాల గురించి మాట్లాడుతున్న కెసిఆర్ మాత్రం ఈ సమయంలో విపక్షాలను కూడగట్టే ప్రయత్నాలు మాత్రం చేయక పోవడం గమనార్హం. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా కరోనాతో గంగారామ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నారు. దీంతో మమతా బెనర్జీనిర్వహించే భేటీలో కాంగ్రెస్ నుంచి ఎవరైనా పాల్గొంటారా అన్నది చూడాలి. విపక్షాలు కూడా ఓ సమర్థనేతను బరిలోకి దింపితేనే మంచిది.గెలిచినా ఓడినా అభ్యర్థి ప్రజల్లో మంచి పేరున్న వాడుఅయితే కనీసం సానుభూతి అయినా వస్తుంది. దాదాపు 20మంది విపక్ష నేతలకు మమతా బెనర్జీ లేఖలు రాసింది. ఇందులో నేటి సమావేశానికి ఎంతమంది వస్తార్నదికూడా ప్రశ్నే. మోడీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కెసిఆర్ కూడా పెద్దగా చొరవచూపడం లేదు. వీలైనంత వరకూ ప్రతిపక్షాలు ఒక ఉమ్మడి అభ్యర్థిని నిలిపే ప్రయత్నం చేయవలసి వుంటుంది. పట్టువిడుపులతో అలాంటి పోటీ అభ్యర్థిని ఎంపిక చేయడానికి అనేక సంప్రదింపులు, కసరత్తు చేయాల్సి ఉంటుంది. రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువలను, సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వంను కాపాడే వారే కాకుండా..ప్రజల సమస్యలపై అవగాహన కలిగి అవసరమైతే జోక్యం చేసుకునే సత్తా కలిగిన నేత రాష్ట్రపతిగా వుంటే బాగుంటుంది. వచ్చే ఎన్నికల తర్వాత సర్కారు ఏర్పాటుపై కూడా రాష్ట్రపతి నిర్ణయం కీలకమయ్యే అవకాశం వుండొచ్చు. జులై 18వ తేదీన కొత్త రాష్ట్రపతి ఎన్నిక జరుగుతుందని ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది. దానికి ముందు నుంచే ఈ విషయమై పలు ఊహాగానాలు, వ్యూహాలు సాగుతూ వస్తున్నాయి. కేంద్రంలో మోడీ అధికారం లోకి వచ్చే సమయానికి ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతిగా వుండేవారు. కాంగ్రెస్ వామపక్షాల మద్దతుతో ఎన్నికైనప్పటికీ ఆయన ప్రధాని నరేంద్ర మోడీతోనూ పేచీలు లేకుండా చూసుకున్నారు. మోడీ కూడా తనకు ఆయనపై ప్రత్యేక గౌరవమని చెబుతూ వచ్చారు. మరోసారి కూడా ఆయనను కొనసాగిస్తారనే వరకూ ఈ ఊహలు నడిచాయి. కాని అది జరగదని కూడా అందరికీ తెలుసు. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం మరీ ముఖ్యంగా రాష్ట్రపతి ఎంపికలో ప్రధాని పూర్తిగా తమ మనిషినే ఎంచుకుంటారు. భారత రాష్ట్రపతి పదవి నామమాత్రమైనదిగా కనిపించినా ప్రత్యేక పరిస్థితులలో నిర్ణాయకంగా మారుతుంది. కాంగ్రెస్ గుత్తాధిపత్యం వున్నంత వరకూ ఈ విషయం పెద్దగా చర్చజరగలేదు. 1977లో ఎమర్జన్సీ తర్వాత కాంగ్రెసేతర ప్రభుత్వాలు మిశ్రమ ప్రభుత్వాలు ఏర్పడుతున్న కొద్దీ ఈ ప్రాధాన్యత మరింత పెరిగింది. ప్రజలు ఇందిరాగాంధీని ఓడించి జనతా ప్రభుత్వం ఏర్పడేలా చేసిన తర్వాత...మారిన పరిస్థితులలో అంతకుముందు ఓడిన సంజీవరెడ్డి...అందరి అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. దేశంలో అలాంటి ఏకగ్రీవ ఎన్నిక అదొక్కటే. మిగిలిన రాష్ట్రపతులందరూ ఏవో పార్టీల నుంచి ఎవరో ఒక ప్రత్యర్థిని ఎదుర్కొని గెలవాల్సి వచ్చింది. పదవిలో వున్న రాష్ట్రపతి దిగిపోయేలోగా కొత్త వారి ఎన్నిక జరగాలని రాజ్యాంగంలోని 62(1)వ అధికరణం నిర్దేశిస్తున్నది. అత్యున్నత స్థాయిలో ఎట్లాంటి శూన్యత వుండరాదనేది దీని ఉద్దేశం. రాష్ట్రపతి భారత దేశ సమగ్రతకూ సార్వభౌమత్వానికి ప్రతీక. రాజ్యాంగాధినేత. ఓట్లను బట్టి చూస్తే బిజెపి కూటమికి కేవలం 20 వేల ఓట్లు మాత్రమే తక్కువ పడతాయి. ఇప్పటికే ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఎ.పి ముఖ్యమంత్రి జగన్ ప్రధాని మోడీని కలుసుకుని వచ్చారు. వారు బిజెపి చెప్పిన అభ్యర్థికే ఓటు వేస్తారన్న అభిప్రాయం అందరిలో వుంది. గత ఎన్నికల్లో అధికారంలోని టిడిపి, టిఆర్ఎస్, ప్రతిపక్షం లోని వైసిపి బిజెపి కూటమి అభ్యర్థికే ఓటేశాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కెసిఆర్ తన వ్యూహం మార్చారు. మోడీకి వ్యతిరేకంగా పార్టీని పెట్టాలని నిర్ణయం తీసుకు న్నారు. ఈ క్రమంలో మమతా బెనర్జీ కెసిఆర్‌ను అధిగమించి ఆయనకన్నాముందే తానే విపక్షపార్టీలతో మీటింగ్ ఏర్పాటుచేయడం ద్వారా కెసిఆర్‌ను తక్కువ చేయాలని చూస్తున్నారు. రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువలను, సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వంను కాపాడే సమర్థుడు రాష్ట్రపతిగా వుండాలనేది అందరి అభిప్రాయం. ఈ క్రమంలో విపక్షాల అభ్యర్థిగాప్రచారం అవుతున్న శరద్‌పవార్ అందుకు తగిన వ్యక్తిగా గుర్తించలేదం. ప్రస్తుత ఎన్నికల నేపథ్యం లో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా వివిధ పార్టీల నేతలతో సంప్రదింపులు ప్రారంభించారు. బాధ్యతను మల్లికార్జున ఖర్గేకు అప్పగించారు. ఇదే సందర్భంలో మమతా బెనర్జీకూడా రంగంలోకి దిగడంతో ఆచితూచి నిర్ణయం తీసుకోవడం అనివార్యం కానుంది. ప్రతిపక్షం తరపున శరద్ పవార్ పేరు ఇప్పటి వరకు బయటకు వచ్చింది. ఎన్‌డిఎ పక్షాన రాజ్‌నాథ్ సింగ్, ఆనందీబెన్ పటేల్, ద్రౌపది ముర్మ వంటి పేర్లు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా వున్న వెంకయ్య నాయుడుపైనా కొందరు కావాలని ఊహాగానాలు చేస్తున్నా జాతీయ మీడియాలో ఆపేరు కనిపించడం లేదు. మొత్తంగా ఎక్కడా అభ్యర్థి ఎవరన్నది బటయకు రావడం లేదు. ఈ క్రమంలో విపక్షాలునిలిపే అభ్యర్థికి కూడా గెలుపు అవకాశాలు లేవు. ఉన్నంతలో ఓ మంచి నాయకుడిని, వివాదరహితుడిని అంతాకలసి ఏకగ్రీవంగా ఎన్నుకుంటే మంచిది.

పృథ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# నేతల రాకతో గ్రామాల్లో రాజకీయ వేడి
## ప్రజలతో మమేకం అవుతున్న నేతలు ● ఊరూవాడా చుట్టేస్తున్న నాయకులు

**హైదరాబాద్, జూన్ 14 (సమ సమాజం):** తెలంగాణతో పాటు ఎపిలోనూ రాజకీయ వేడి రాజుకుంటోంది. కొన్ని రోజులుగా రాజకీయ పార్టీల సందడి జోరుగా కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేకున్నా ఖాళీగా కూర్చునే ఆలోచనలో లేరు. అక్కడ టిడిపి,బిజెపి,జనసేన ఏదో ఓ కార్యక్రమంతో ప్రజల్లోకి వెళుతున్నాయి. నిత్యం ప్రజల్లోనే ఉంటున్నాయి. తెలంగాణలో కూడా బిజెపి, కాంగ్రెస్, టిఆర్ఎస్ కూడా నిత్యం కార్యక్రమా లతో ప్రజల్లోకి వెళుతోంది. ఇలా జిల్లాలో ప్రధాన రాజకీయ పక్షాలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి బలోపేతం కావడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక్కో పార్టీ ఒక్కో పేరిట ప్రజల్లోకి వెళ్లి తమ వాణిని వినిపిస్తు న్నాయి. టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా నేరుగా ఓటరు వద్దకు వెళ్లుతున్నాయి. ఎమ్మెల్యేలు జనంలో ఉండాలన్న అధికార పక్షం ఆదేశాన్ని తూచా తప్పకుండా టీఆర్ఎస్ నేతలు పాటిస్తున్నారు. ప్రజల మధ్య ఉంటూ తమ గెలుపునకు వ్యూహ రచన చేస్తున్నారు. ప్రతి పక్ష ఆశావహులు సైతం గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో ప్లలెలు, పట్టణాల్లో ముందస్తు హడావిడి చోటుచేసుకుంటోంది. నిత్యం ఎదో ఒక పార్టీ నేత, ఏదో ఒక కార్యక్రమం పేరిట ప్రజల వద్దకు వస్తున్నారు. తమ తమ ప్రభుత్వాల పాలన, పార్టీ కార్యక్రమాలు, లక్ష్యాలు, పనితీరును వివరించడానికి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో ముందస్తు శాసన సభ ఎన్నిక లు జరగవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో రాజకీయ నాయ కులు తమ దూకుడును పెంచుతు న్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ముందస్తు హడావిడి స్పష్టంగా కనిపిస్తోంది. అధికార టీఆర్ఎస్ పార్టీ సందడి ఎక్కువగా ఉంటోంది. ప్రభుత్వ పథకాలపై టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజా ప్రతినిధులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మంత్రులు పల్లె,పట్టణ ప్రగతిలో భాగంగా ఊరూవాడ చుట్టేస్తున్నారు. ముఖ్యంగాకెటిఆర్,హరీష్ రావులు ప్రతి జిల్లాలో ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటున్నారు. దీంతో పాటు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్లలె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ఇతర ప్రజాప్రతినిధులు ప్రజలతో భాగస్వామ్యమై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టీఆర్ఎస్ సర్కారు చేపట్టిన పథకాలను వివరించడం, లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాధీ ముబారక్, సీఎం సహా య నిధి వంటి చెక్కులను గడప వద్దకు వెళ్లి అందించడం వంటి కార్యక్ర మాలను నిర్వహిస్తున్నారు. దీనికి తోడు మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సైతం ఇటీవల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.రైతుల వద్దకు కాంగ్రెస్ రాష్ట్రంలోని వరంగల్‌లో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ పర్యటించిన సందర్భంగా వ్యవసాయంపై ఇచ్చిన డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకవెళ్లి వి వరించడానికి కాంగ్రెస్ పార్టీ గట్టి ప్రయత్నం చేస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎనిమిదేళ్ల పాలనపై వివరిస్తూ బీజేపీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. బీజేపీ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఇంటింటి ప్రచారాన్ని కమలనాథులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ అరాచక పాలన అందిస్తోందని విమర్శిస్తూనే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పథకాలు, అభివృద్ధి పనుల ను వివరిస్తున్నారు. అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన, స్వచ్ఛ భారత్, జనని సురక్ష, బేటి బచావో, బేటి పడావో, సర్వ శిక్షా అభియాన్, ప్రధానీ ఫసల్ బీమా యోజన, ఉజ్వల యోజన తదిత ర కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను విస్తృతంగా పంపిణీ చేస్తున్నారు. మొత్తంగా అన్ని పార్టీలు ఇప్పుడు ప్రజల్లో ఉంటున్నాయి. తమ ఘనతను చాటుతున్నాయి. తామే బెటర్ అని చెప్పుకుంటున్నాయి.

# రసవత్తరంగా రాష్ట్రపతి ఎన్నికలు

(మొదటి పేజి తరువాయి) సమాచారం. అందుకే మమత సమావేశానికి ప్రతినిధులను పంపాలని భావిస్తున్నాయి కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలు. అయితే అగ్రనేతలు కాకుండా.. ఎంపీ స్థాయిలో ఉన్న నేతలను పంపాలని నిర్ణయించినట్లు సమాచారం. కాంగ్రెస్ నుంచి కీలక నేతలు మల్లికార్జున ఖర్గే, జైరామ్ రమేశ్, రణ్‌దీప్ సుర్జేవాలా.. మమతా బెనర్జీ నిర్వహించే సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెప్పారు. సీపీఎం, సీపీఐ నుంచి కూడా.. పార్టీ అగ్ర నేతలు సీతారాం ఏచూరి, డి.రాజా కాకుండా ఎంపీలు వెళ్లనున్నారు. సీపీఎం నుంచి రాజ్యసభలో పార్టీ నాయకుడిగా ఉన్న కరీం హాజరయ్యే అవకాశం ఉంది.అదే విధంగా మమత లేఖకు సీపీఎం అగ్రనేత ఏచూరి ప్రత్యుత్తరం కూడా రాశారు. మమత ఏకపక్ష నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు మందస్తు సమాచారం, సంప్రదింపులు ఉంటే బాగుంటుందని ఆ లేఖలో అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం కోసం.. ఇప్పటికే మమతా బెనర్జీ దిల్లీకి చేరుకోగా.. ఎన్సీపీ అధినేత కూడా హస్తినకు వచ్చారు. మమతా బెనర్జీ.. దిల్లీ చేరుకున్న తర్వాత నేరుగా పవార్? ఇంటికి వెళ్లి చర్చించారు. రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు ఒప్పించేందుకు దీదీ ప్రయత్నించినట్లు తెలుస్తోంది.అయితే దీదీ కలవడానికి ముందు.. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జనరల్ సెక్రటరీ రాజా కూడా శరద్ పవార్‌ను కలిశారు. వారు పవార్‌ను ఒప్పించేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అయితే ఏచూరి, రాజా ప్రయత్నాలు ఫలించలేదు. రాష్ట్రపతి ఎన్నికకు ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా నిలబడేందుకు పవార్ నిరాకరించినట్లు, ఇతర నేతల పేర్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

## పుట్టిన రోజును రక్తదానంతో జరుపుకోండి

(మొదటి పేజి తరువాయి) హరీష్ రావు తెలిపారు. తల్లి రక్తాన్ని ధారపోసి మనకు జన్మనిస్తే..మనం రక్తాన్ని ఇచ్చి మరొకరికి పునర్జన్మను ఇవ్వొచ్చన్నారు. వీలైనంత వరకు ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులకు రక్తం ఇవ్వాలన్న మంత్రి ఒక మనిషి 168 సార్లు రక్త దానం చేయవచ్చని తెలిపారు. కేసీఆర్ పుట్టిన రోజున తానే స్వయంగా రక్తదానం చేసినట్లు గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బ్లడ్ సేపరేటర్లను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కొన్ని చోట్ల రక్తాన్ని నిరుపయోగంగా ఉంచుతునట్లు తెలుస్తోందని..రక్తం వృధా కాకుండా సద్వినియోగం అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# రక్తదానాన్ని పండగలా జరపాలి

(మొదటి పేజి తరువాయి) ఒకే దానం రక్త దానం అన్నారు. అందరికి రక్తదానంపై అవగాహన రావాలి.. డొనేట్ చేస్తేవారి ఆరోగ్యం కూడా బాగుంటుందని గవర్నర్ తెలిపారు. ఆపద సమయంలో మన దగ్గరి బంధువులు కూడా రక్త దానం చేయాదనికి ముందుకు రారు.. కానీ రక్త దాతలు మాత్రం ముక్కుమొహం తెలియని వారికి సహాయం చేస్తున్నారని గవర్నర్ ప్రశంసించారు. అన్ని జిల్లాల్లో మంచి స్టోరేజి సౌకర్యం ఉంది. ఆర్మీ, పోలీస్ లు కోవిడ్ సమయంలో రక్త దానం చేసి తలసెమియా రోగులకు సహాయం చేశారని కొనియాడారు. కలెక్టర్లు కూడా ఈ కార్యక్రమంలో భాగం కావడం సంతోషంగా ఉంది.రాజ్ భవన్ కూడా ఎప్పుడూ సేవలు చేయాడానికి సిద్ధంగా ఉంటుందని గవర్నర్ పేర్కొన్నారు.

# ఉద్యమం నాటి కెసిఆర్ కాదు

(మొదటి పేజి తరువాయి) రాజేందర్ అన్నారు. టీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలపై ఈటల నిప్పులు చెరిగారు. నల్లగొండ జిల్లా పర్యటనలో ప్రజలు తనకు బ్రహ్మరథం పడితే.. అధికారపార్టీకి చెందిన మీడియా ఖాళీ కుర్చీలు చూపించడాన్ని తప్పుబట్టారు. సిద్దిపేట పొంగిపోతే నేడు కుంగిపోతోందని వాపోయారు. తాను పార్టీ మారలేదని, టీఆర్ఎస్ వాళ్లే వెళ్లగొట్టారని ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. తనను రాజీనామా చేయాలని రెచ్చగొడితే ఆత్మగౌరవం కోసం రాజీనామా చేశానని చెప్పారు. టీఆర్ఎస్ పోయి బీఆర్ఎస్ వచ్చిందని సటైర్ వేసిన ఈటల టీఆర్ఎస్ ను వీఆర్ఎస్ తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ కు టైంకు మందు గోలీలు ఇచ్చేందుకు సంతోష్ కుమార్ కు రాజ్యసభ ఎంపీ పదవి ఇచ్చారని విమర్శించారు. సీఎం పదవిని కేసీఆర్ ఎడమకాలి చెప్పుతో పోల్చడం నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించడమేనని అన్నారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయం వెనుక ఎందరో ఆడబిడ్డల ఆర్తనాదాలు ఉన్నాయని ఈటల రాజేందర్ వాపోయారు. పబ్ ల కారణంగా అమ్మాయిల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని, హైదరాబాద్ లో ఉన్న ఈ విష సంస్కృతిని బీఆర్ఎస్ ద్వారా దేశం అంతటా పాకిస్తావా అని ప్రశ్నించారు. రూ. 5 లక్షల కోట్లు అప్పు చేసిన సర్కారు కనీసం ఉద్యోగులకు సరైన సమయానికి జీతాలు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై ఎక్కడ చర్చ పెట్టినా వచ్చేందుకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. తెలంగాణలో ప్రజలది తప్ప పీకేది ఏం నడవదని ఈటల స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ రైతు విధానాలు
### అంతటా అమలు చేస్తే హరిత విప్లవం సాధ్యమే
### బిజెపికి ఈ విధానాలు అర్థం కావడం లేదు: జగదీశ్వర్ రెడ్డి



**సూర్యాపేట, జూన్ 14 (సమ సమాజం):** తెలంగాణలో సిఎం కెసిఆర్ అనుసరిస్తున్న రైతు విధానాలను భారతదేశ వ్యాప్తంగా అమలు చేస్తే దేశంలో హరితవిప్లవం సాధించవచ్చని మంత్రి జగదీశ్వర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి పథకం,బీమా పథకం అమలు చేయడం, పండిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి పథకాలు పక్కాగా అమలయితే దేశంలో కరువు కాటకాలు ఉండవన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడరని అన్నారు. ఇవన్నీ సాకారం చేసుకునే దిశగా తెలంగాణ ఒక్కో అడుగు వేస్తున్నదని, వేసిన అడుగు విజయవంగా సాగుతున్నదని అన్నారు. రానున్న కాలంలో తెలంగాణ వ్యవసాయ రంగంలో ఓ రోల్ మాడల్‌గా నిలవబోతున్నదని అన్నారు. రైతుబీమా పథకం దేశానికే మార్గదర్శకంగా మారనుందని అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలని తపిస్తున్న సిఎం కెసిఆర్ రైతును రాజు చేయడమే లక్ష్యంగా అనేకానేక చర్యలు తీసుకుని మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. ఇలా వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి, ప్రవేశపెట్టిన పథకాలు గురించి సీఎం కేసీఆర్.. ప్రధాని మోదీకి వివరించినా పాటించే స్థితిలో లేరని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ వ్యవసాయరంగంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిచిందని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బీమా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే నామినీకి పది రోజుల్లో రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందుతుందని చెప్పారు. అందుకే ఈ పథకాలను తెలుసుకున్న దేశంలోని అన్ని రాజకీయపార్టీలు సీఎం కేసీఆర్‌ను కొనియాడుతు న్నాయన్నారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ రైతుబీమా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. ఎన్నడూలేని విధంగా పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నామని, పక్క రాష్ట్రాల్లో సరైన మద్దతు ధర లభించని రైతులు కూడా తెలంగాణకు వచ్చి అమ్ముకుంటున్నారని తెలిపారు. పోడు భూముల్లో వ్యవసాయం చేసే రైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. కాళేశ్వరం సహా చేపట్టిన అన్ని ప్రాజెక్టులు పూర్తయితే ఇక సాగునీటికి ఢోకా ఉండదన్నారు. ఇప్పటికే చెరువుల పునరుద్ధరణ జోరుగా సాగుతోందన్నారు. దీంతో సేద్యం అన్నది రైతుకు భారం కాబోదన్నారు. దేశంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అని మంత్రి పేర్కొన్నారు. : ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించుకుని, అమలు చేసుకుంటున్నామని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలోనే తెలంగాణ ఒక్కటేనన్నారు.రాష్ట్ర ఆవిర్భావం మొదటి ఏడాదిలో కరెంట్ ఇబ్బంది ఉండేదని, పక్క రాష్ట్రాల నుంచి అతికష్టం మీద విద్యుత్‌ను కొనుగోలు చేసి 25లక్షల మంది బోర్లకు విద్యుత్‌ను అందించామన్నారు. గతంలో మాదిరిగా రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే స్టాక్ పెట్టుకుంటున్నమని పేర్కొన్నారు. పండిన పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నమని పేర్కొన్నారు. తెలంగాణలో 24గంటల కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు ఇస్తున్నరని, తాముకూడా తెలంగాణలో కలుస్తామని మహారాష్ట్ర,కర్నాటక బార్డర్ రైతులు అంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి ఇన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్న సీఎం దేశంలో కేసీఆర్ ఒక్కరేనని ఆయన స్పష్టంచేశారు

# నిరుద్యోగులకు ప్రధాని తీపికబురు
### ఏడాదిన్నరలోగా 10లక్షల ఉద్యోగ నియామకాలు



**న్యూఢిల్లీ, జూన్ 14 (సమ సమాజం):** దేశంలోని నిరుద్యోగులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం శుభవార్త వెల్లడించారు. వచ్చే ఏడాదిన్నరలోగా మిషన్ మోడ్‌లో భాగంగా దేశంలోని వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, మంత్రిత్వశాఖల్లో 10లక్షలమందిని రిక్రూట్ మెంట్ చేయాలని ప్రధాని మోదీ మంగళవారం కేంద్ర అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలు, కేంద్ర మంత్రిత్వ శాఖల్లో మానవ వనరుల స్థితిగతులను సమీక్షించిన తర్వాత మోదీ దిశానిర్దేశర చేసినట్లు ప్రధాన మంత్రి కార్యాలయం తెలిపింది. నిరుద్యోగ సమస్యపై ప్రతిపక్షాలు తరచూ విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వివిధ ప్రభుత్వ రంగాల్లో పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్న పోస్టులపై ప్రతిపక్షాలు తరచూ ధ్వజమెత్తాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని కేందప్రభుత్వ శాఖలు,మంత్రిత్వ శాఖలలో మానవ వనరుల స్థితిని సమీక్షించారు రాబోయే 1.5 సంవత్సరాలలో 10 లక్షల మందిని మిషన్ మోడ్‌లో ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ చేయాలని ఆదేశించింది' అని పీఎంఓ ట్వీట్‌లో పేర్కొంది.

# రెండో రోజు ఈడీ విచారణకు రాహుల్



(మొదటి పేజి తరువాయి) ఇతర కాంగ్రెస్ నేతలు పార్టీ కార్యాలయానికి వెళ్లకుండా దారిలోనే అడ్డుకున్నారు. దీంతో ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్టీ కార్యాలయంలోకి వెళ్లలేకపోయారు. పార్టీ కార్యాలయానికి ఎవరి వాహనాల్లో వారు వెళ్తున్నామని కాంగ్రెస్ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు, కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. మాన్ సింగ్ రోడ్ సర్కిల్ పై కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టేరు. కాంగ్రెస్ కార్యకర్తలతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. ఆందోళన చేస్తున్న కొందరు కాంగ్రెస్ ఎంపీలను నిర్బంధించారు ఢిల్లీ పోలీసులు. ఈడీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ నేతలు హరీశ్ రావత్, రణ్ దీప్ సింగ్ సూర్జేవాలాను అదుపులోకి తీసుకున్నారు. ఘర్షణకు దిగిన కొందరు కార్యకర్తలను పోలీసులు ఈడ్చుకెళ్లారు. దేశవ్యాప్తంగా సోమవారం నుంచి కాంగ్రెస్ నిరసనలు కొనసాగుతున్నాయి. రాహుల్ ఈడీ విచారణ దృష్ట్యా ఢిల్లీలోని లుటియన్స్ ప్రాంతంలో ట్రాఫిక్ జాం జరగకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సెంట్రల్ ఢిల్లీ ప్రాంతంలో ఆంక్షలు విధించారు. అక్బర్ రోడ్, జన్ పథ్ రోడ్, అబ్దుల్ కలాం మార్గ్, పృథ్వీరాజ్ రోడ్, మోతీలాల్ నెహ్రూ మార్గ్, సునేహ్రీ బాగ్ మార్గాలను పోలీసులు మూసేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయ పరిసరాలు, ఈడీ ఆఫీస్ పరిసరాల్లో సెక్షన్ 144 విధించారు. అయినా మంగళవారం కూడా కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టడతారని.. ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ ఏఐసీసీ కార్యాలయం దగ్గరికి.. కాంగ్రెస్ శ్రేణులు భారీగా చేరుకున్నారు. ముందుగా సోదరి ప్రియాంక గాంధీతో కలిసి ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు, పలువురు నేతలు రాహుల్‌కు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులతో బాహాబాహీకి దిగారు. ఆందోళన చేస్తున్న కొంతమంది కాంగ్రెస్ ఎంపీలను దిల్లీ పోలీసులు నిర్బంధించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలాను సైతం అదుపులోకి తీసుకున్నారు. రాహుల్ గాంధీని ఈడీ ప్రశ్నిస్తున్న నేపథ్యంలో మంగళవారం కూడా ఆందోళన కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నిర్ణయించింది. దీంతో పోలీసులు సైతం ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

# తెలంగాణను తాకిన నైరుతి పవనాలు
### అక్కడక్కడా వర్షాలు ప్రారంభం ❑ జంటనగరాల్లోనూ చిరు జల్లులు

**హైదరాబాద్, జూన్ 14 (సమ సమాజం):** రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకాయి. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాలోకి ప్రవేశించాయని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. రెండు రోజుల్లో తెలంగాణలోని మరికొన్ని జిల్లాలకు, ఆ తర్వాతి రెండు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరిస్తాయని వెల్లడించింది. హైదరాబాద్‌లో కూడా సోమవారం సాయంత్రం నుంచి ఉరుములు మెరుపులు మొదలై చిరుజల్లులు పడ్డాయి. ఈ సారి రుతుపవనాలు ఐదు రోజులు ఆలస్యంగా వచ్చాయి. ఈ నెల 8నే రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. కానీ నాలుగు రోజులు ఆలస్యంగా సోమవారం రాష్ట్రంలో ప్రవేశించాయి. కిందటేడు జూన్ 5నే రుతుపవనాలు రాష్ట్రమంతా విస్తరించాయి. ఈసారి జూన్ 2న కేరళకు వస్తాయని అంచనా



వేయగా, మూడు రోజులు ముందుగానే మే 29న కేరళలోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. ఈసారి జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షపాతం సాధారణం (106శాతానికి పైనే) కంటే ఎక్కువగా నమోదయ్యే చాన్స్ ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. జూన్‌లో నెలలో మాత్రం సాధారణ వర్షపాతమే నమోదు కానుందని తెలిపింది. వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రలకు కాస్త తగ్గాయి. ఇటీవల 43 నుంచి 45 డిగ్రీల వరకు నమోదైన ఉష్ణోగ్రతలు సోమవారం మూడు జిల్లాలు మినహా అన్ని చోట్ల 40డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం జిల్లాలోని మధిరలో 41.5, సూర్యాపేటలోని మునగాల, నల్లగొండలోని దామరచర్లలో 41.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఉక్కపోత, వేడిమి తగ్గింది. ఇప్పటి నుంచి వాతావరణం ఇలాగే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఎండలు కూడా మరింత తగ్గుతాయంటున్నారు. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాకతో పలు జిల్లాల్లో వానలు పడ్డాయి. ఉరుములు, మెరుపుతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు జయశంకర్ భూపాలపల్లిలోని మల్లారంలో 7 సెం.మీ., కామారెడ్డిలోని మెనూరులో 6.9, మంచిర్యాలలోని కోటపల్లిలో 6.5, సిద్దిపేటలోని తిమ్మారెడ్డిపల్లిలో 5.3 సెం.మీ., నాగర్? కర్నూల్? జిల్లా తాడూరులో 3 సెం.మీ చొప్పున వర్షపాతం రికార్డయ్యింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షం పడవచ్చని అంచనా వేసింది. ముఖ్యంగా మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు ఉంటాయంది. ఈ మేరకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

## మేడిపల్లిలో ఘనంగా శ్రీరామకోటి, శ్రీమద్ భగవద్గీత జ్ఞాన యజ్ఞం,హెూమాలు



**ఇబ్రహీంపట్నం, జూన్ 14 సమ సమాజం:** నియోజకవర్గం యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ రామకోటి సేవాసమితి నాంపల్లి వారి ఆధ్వర్యంలో,మేడిపల్లి గ్రామసర్పంచ్ పాలకవర్గం, భక్త బృందం సహకారంతో 12వ శ్రీ రామకోటి శ్రీలక్ష్మి శ్రీమద్ భగవద్గీత జ్ఞాన యజ్ఞం రెండు దినములు నిర్వహించగా చివరి రోజైన మంగళవారం శ్రీశ్రీశ్రీ దయానందగిరి స్వామీజీ సభాధ్యక్షత ఘనంగా శ్రీ రామకోటి జ్ఞాన ప్రవచనాలు, హెూమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని విచ్చేసిన భక్తులకు,ప్రజానీకందరికీ అన్నదాన వితరణ కార్యక్రమం సర్పంచ్ చిగురింత శ్రీనివాస్ రెడ్డి ,1 వ వార్డు మెంబర్ ఆడాల వరలక్ష్మి గణేష్ నిర్వహించారు.సగటు మానవాళి జీవితాలలో ఆధ్యాత్మికత దైవారాధన కరువైందని, మోక్ష మార్గానికి ప్రశాంతతకు దైవారాధన ముఖ్యమని శ్రీ దయానందగిరి స్వామీజీ ప్రజలకు సూచించారు.గ్రామ ప్రజలందరూ కుటుంబంతో సహా ఈ కార్యక్రమానికి విచ్చేసి సమయం కేటాయించినందుకు సర్పంచ్ పాలకవర్గం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అలంపల్లి సత్తమ్మ కృష్ణ, ఎంపీటీసీ మొరుగు శివలీల రమేష్, ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్ రెడ్డి,మాజీ సర్పంచులు కర్నాటి రంగారెడ్డి,బోడ కృష్ణ,బాలరాజ్ గౌడ్,పాశ్చ బాషా,వార్డు సభ్యులు, కలకొండ బీరప్ప భక్తులు గ్రామ ప్రజలు, ఎంఎన్ఆర్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ మల్లికార్జున భ్రమరాంబ కేతమ్మల కళ్యాణ మహెూత్సవం



**ఇబ్రహీంపట్నం, జూన్ 14 సమ సమాజం:** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోల్కంపల్లి అనుబంధ గ్రామమైన మాన్యగూడ లో శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహెూత్సవం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుండే కాక వివిధ మండలాల నుంచి కల్యాణ మహెూత్సవాన్ని తిలకించడానికి అశేష జనం రావడం జరిగింది. అందరి సమక్షంలో కల్యాణ మహెూత్సవం మల్లికార్జునుడు సంతోష పడేలా గత 16 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న కళ్యాణ మహెూత్సవానికి భక్తి శ్రద్ధలతో టి మల్లికార్జున స్వామి ఆశీర్వాద నిమిత్తం ఎంతో మంది భక్తులు ఇక్కడికి చేరుకున్నారు. యాదవ కురుమ సంఘం ఆలయ కమిటీ సభ్యులు, కుల పెద్దలు గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, ఉప సర్పంచ్ కళ్యాణ మహెూత్సవాన్ని తిలకించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఎల్లవేళలా మల్లికార్జున స్వామి కృపా కటాక్షములు దీవించే విధంగా ప్రజలందరిని చూడాలని ఆలయ కమిటీ వేడుకున్నట్లు తెలిపారు.

## భూనిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి) అదేవిధంగా గౌరవెల్లి నిర్వాసితులకు కూడా ఇవ్వాలి అని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేస్తుంది. ఏ సంబంధం లేని తెలంగాణకు సంబంధం లేని వాళ్లకు కోట్ల రూపాయల భూములు పంచిపెట్టే మీకు ప్రాజెక్టు కోసం త్యాగం చేసే వాళ్లకి నష్టపరిహారం ఇవ్వడానికి మీకు ఏమి నొప్పి కెసిఆర్ గారు. కోట్ల ఎకరాల ప్రభుత్వ భూమి మీ పార్టీ ఆఫీసులకు వాడుకోవచ్చు కానీ ప్రాజెక్టుల కోసం త్యాగం చేసే వారికి విలువలేద ఇదెక్కడి న్యాయం! అని ఆప్ నేత ఇందిరాశోభన్ అన్నారు.

# నకిలీ వేకిలి

### నకిలీ సర్టిఫికెట్లతో కాంట్రాక్ట్ లెక్చరర్లు

**హైదరాబాద్, జూన్ 14 (సమ సమాజం):** కాంట్రాక్ట్ జూనియర్ లెక్చర్లలో 230 మంది నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందినట్లు తెలంగాణ ఆర్థికశాఖ అధికారులు గుర్తించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో వివిధ శాఖల్లోని కాంట్రాక్ట్ ఉద్యోగుల వివారలను సేకరించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు 11 వేల మంది ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే వారి వివరాలు పంపించాలని ఆయా శాఖలను ఆర్థిక శాఖ కోరింది. దీంతో తమ తమ శాఖల్లోని ఉద్యోగుల వివరాలను అధికారులు సేకరించి, వారి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేశారు. ఈ క్రమంలో అనేక అవకతవకలు వెలుగు చూశాయి. 230 మంది కాంట్రాక్ట్ లెక్చుర్ల్ర నకిలీలుగా తేలింది. మరికొంత మంది మంజూరు లేని పోస్టులలోపనిచేస్తున్నట్లు, క్వాలిఫికేషన్ లేకున్నా కాంట్రాక్ట్ లెక్చురర్లుగా జాయిన్ అయినట్లు బయటపడింది. ఇప్పటి వరకు 18 మంది డిగ్రీ లెక్చర్లు, ఆరుగురు పాలిటెక్నిక్ లెక్చురర్లకు అధికారులు షోకాజ్ నోటీసులు అందించారు. మరి నకిలీ లెక్చరర్ల విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

## వాసాలమర్రి పునర్నిర్మాణానికి సహకరించాలి: ఎమ్మెల్యే

**యాదాద్రి భువనగిరి, జూన్ 14 (సమ సమాజం):** వాసాలమర్రి గ్రామ పునర్నిర్మాణానికి గ్రామస్తులు సహకరించాలని గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుకుందామని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రిలో మంగళవారం గ్రామ పునర్నిర్మాణంలో భాగంగా.. అధికారులు ఆర్కిటెక్చర్లు రూపొందించిన గ్రామ డ్రాఫ్ట్ లేఅవుట్‌ను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఐదుగురు దళిత బంధు లబ్దిదారులకు యూనిట్లను పంపిణీ చేశారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న 340 పెంకుటిళ్లు, మట్టిగోడలు రేకుల ఇళ్లను కూల్చివేసి వాటి స్థానంలో ఒక్కో కుటుంబానికి 200 గజాల స్థలంలో నూతన గృహాలను నిర్మించి ఇవ్వనున్నట్లు తెలిపారు. దళిత బందు లబ్దిదారులు తమకు మంజూరైన యూనిట్లను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. వారి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు ఉన్నారు.

# ఓర్వలేకనే తెలంగాణ అభివృద్ధికి అడ్డంకులు



హక్కుగా రావాల్సిన నిధులను నిలిపివేసారు

బిజెపినేతలు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు

గజ్వేల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రమాణంలో మంత్రి హరీష్

**సిద్దిపేట, జూన్ 14 (సమ సమాజం):** తెలంగాణ అభివృద్ధిని ఓర్వలేకే కేంద్రం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మంత్రి హరీష్ రావు ఆరోపించారు. తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధులను కావాలనే నిలిపివేసిందని చెప్పారు. బీజేపీ నాయకులు ఏం ముఖం పెట్టుకుని సిద్దిపేట, గజ్వేల్ లో తిరుగుతున్నారని హరీష్ రావు మండిపడ్డారు. ఉపాధి హామిని వ్యవసాయానికి అనుబంధం చేయాలని, ఇప్పటికే మూడుసార్లు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపామని, ముందుగా ఆ పని చేసుకొచ్చి ముఖం చూపిస్తే బాగుంటుందని బీజేపీ నేతలకు చురకలంటించారు. వ్యవసాయ బావుల వద్ద మోటార్లు పెడితే రాష్ట్రానికి రూ.25 వేల కోట్లు ఇస్తామని కేంద్రం ఆశ చూపిందని, కానీ సీఎం కేసీఆర్ అందుకు ఒప్పుకోలేదన్నారు. ఎఫ్‌సీఐతో బియ్యం కొనకుండా రైసుమిల్లులపై దాడులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన పెండింగ్ నిధులను విడుదల చేయకుండా బీజేపీ ఇబ్బంది పెడితే తెలంగాణ సమాజం తిరగబడుతుందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని మండిపడ్డారు. వరంగల్ లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని బీజేపీ నిలిపివేసిందన్నారు. వరంగల్ కు రావాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని గుజరాత్ కు తీసుకెళ్లారని ఆరోపించారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తారో కేంద్ర ప్రభుత్వం చెప్పాలని మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. చాలాసార్లు దరఖాస్తులు పెట్టినా..మెడికల్ కళాశాలలు, నవోదయ పాఠశాలలు తెలంగాణ రాష్ట్రానికి మంజూరు చేయకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని ఆరోపించారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హరీష్ రావు హాజరయ్యారు. తెలంగాణ విద్యార్థి, ఉద్యమ నాయకుడైన మాదాసు శ్రీనివాస్ గజ్వేల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గా నియమితులయ్యారు. ఆయనతో పాటు కార్యవర్గ సభ్యులు మంత్రి హరీష్ రావు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎదిగిన కొద్ది ఒదిగి ఉండే మనస్తత్వం మాదాసు శ్రీనివాసుది అన్నారు. సీఎం కేసీఆర్ కూడా మాదాసు శ్రీనివాస్ కు పదవి ఇస్తే బాగుంటదనే అభిప్రాయం వ్యక్తం చేశారని చెప్పారు.

## దేశంలో రాజకీయ శూన్యతను గుర్తించిన కెసిఆర్

బిజెపికి ప్రత్యమ్నాయంగా కెసిఆర్ అడుగులు

మతపరమైన హింసకు ఆజ్యం పోస్తున్న బిజెపి

తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శం అన్న మంత్రి సత్యవతి



**మహబూబాబాద్, జూన్ 14 (సమ సమాజం):** దేశ వ్యాప్తంగా ఉన్న రాజకీయ శూన్యతను గుర్తించి కేసీఆర్ జాతీయ పార్టీ పెడుతున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడించారు. కేసీఆర్ నిర్ణయానికి అనేక జాతీయ పార్టీలు మద్దతిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. బీజేపీ కబంధ హస్తాల నుండి దేశాన్ని రక్షించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ పార్టీని నెలకొల్పుతున్నడని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సత్యవతి రాథోడ్ మీడియా సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ఆకలి చావులు జరుగుతున్నా.. బీజేపీ ప్రభుత్వం కేవలం మతపరమైన అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తోందని ఆరోపించారు. అన్ని మతాల కులాల వేదిక అయిన దేశంలోని పేదోళ్లకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకం అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తూ దేశ సంపద అంతా కొద్ది మంది చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. దేశంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ఇంకా లేవలేని స్థితిలో ఉందన్నారు. దేశమంతా విద్యుత్ కోతలు ఉన్నా.. తెలంగాణ రాష్ట్రంలో లేవని మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. దేశంలో బీజేపీకి ఎలాంటి ప్రత్యామ్నాయం లేదని రెచ్చిపోతున్నారని, దోచుకోవడమే పనిగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఆమె విమర్శించారు. మతపరమైన అలజడి సృష్టించే నాయకులకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. దేశ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ స్థాపించే పార్టీ దేశానికి ఎంతో అవసరముందని చెప్పారు. మోదీ మత చిచ్చు దేశ హద్దులు దాటి ప్రపంచంలోకి ప్రవేశించిందని విమర్శించారు. కేసీఆర్ చేపట్టిన ప్రతిపనికి ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చారని తెలిపారు. గిరిజన రిజర్వేషన్ల అంశాన్ని అసెంబ్లీ సాక్షిగా కేంద్రానికి పంపించామని, దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఇక్కడున్న గిరిజనులను బీజేపీ నాయకులు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గిరిజన రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసినా కేంద్రంలో బీజేపీ ఆమోదం తెలపడం లేదన్నారు. తండాలను గూడేలను గ్రామపంచాయతీలు చేసిన ఘనత కేసీఆర్ దేనని తెలిపారు. రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ కోసం 350 ఎకరాల స్థలాన్ని కేటాయించినా నేటి వరకు కేంద్రం నిధులు ఇవ్వలేదని మంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు.

## ఎయిర్ ఇండియాకు 10 లక్షలు జరిమానా

టిక్కెట్లు ఉన్నా బోర్డింగ్ నిరాకరించినందుకు చర్యలు

**న్యూఢిల్లీ, జూన్ 14 (సమ సమాజం):** ఎయిర్ ఇండియాకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ రూ.10లక్షల జరిమానా విధించింది. చెల్లుబాటయ్యే టికెట్లున్న ప్రయాణికులకు బోర్డింగ్ నిరాకరించినందుకు చర్యలు చేపట్టింది. అంతేకాకుండా సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. లేకుంటే చర్యలు తప్పవని డీజీసీఏ పేర్కొంది. చెల్లుబాటు అయ్యే టికెట్లు ఉన్న ప్రయాణికులు సమయానికి హాజరైనప్పటికీ విమానయాన సంస్థలు బోర్డింగ్‌ను తిరస్కరించినట్లు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీలో వరుస తనిఖీలు నిర్వహించింది. ఎక్కడా సంస్థలు నిబంధనలు పాటించడం లేదని తేలింది. ఎయిర్ ఇండియా సంస్థ రెగ్యులేషన్స్‌ను అనుసరించడం లేదని వివరించింది. అందుకే ఆ సంస్థకు షోకాజ్ నోటీసు పంపామని ఆఉఅం పేర్కొంది. చెల్లుబాటయ్యే టికెట్లున్న ప్యాసింజర్లను బోర్డింగ్‌కు అనుమతించని సందర్భంలో ఆ ప్రయాణికులకు గంటలోపే మరో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డీజీసీఏ నిబంధనలను గుర్తు చేసింది. గంటలోపే ప్రత్యామ్నాయంగా మరో విమానాన్ని ఏర్పాటు చేస్తే అలాంటి సందర్భంలో ప్రయాణికులకు పరిహారం అందించాల్సిన అవసరం ఉండదని తెలిపింది. ఒకవేళ ఆ ప్రయాణికులకు ప్రత్యామ్నాయ విమాన సౌకర్యం ఏర్పాటు చేయడానికి 24 గంటల్లోపు సమయం పడితే.. ప్రయాణికులకు రూ.10వేల పరిహారం చెల్లించాల్సి ఉంటుందని చెప్పింది. 24 గంటలు దాటితే ప్రయాణికులకు రూ. 20 వేల నష్టపరిహారం అందించాలని చెప్పింది.

# రాజకీయ ప్రయోజాల కోసమే ఈడీ కేసులు

బీజేపీ విద్వేష భావజాలాన్ని తిప్పికొట్టాల్సిందే

కుట్రలు బయటపడతాయనే భయంతోనే ఈడీతో కేసులు

నేషనల్ హెరాల్డ్ పత్రికతో బండారం బయట పడుతుందన్న భయం

కాంగ్రెస్‌కు ప్రజల ఆదరణ పెరగడంతో మోడీ ద్వయం కుట్రరాజకీయాలు

ఈడీ కార్యాలయం ముందు కాంగ్రెస్ ధర్నాలో రేవంత్, భట్టిల విమర్శలు




**హైదరాబాద్, జూన్ 14 (సమ సమాజం):** రాజకీయ ప్రయోజనాల కోసమే రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై ఈడీతో కేసులు పెట్టిస్తున్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే 14 ఏళ్ల తర్వాత ఈ కేసులను మళ్లీ తెరపైకి తెచ్చారన్నారు. అయితే ఈ కుట్రలను కాంగ్రెస్ తిప్పికొట్టి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈడీ పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కేంద్రం వైఖరిని నిరసిస్తూ టీ కాంగ్రెస్ హైదరాబాద్ ఈడీ ఆఫీస్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్.. బీజేపీ విద్వేష భావజాలాన్ని తిప్పికొట్టి ప్రజా సమస్యలను బయటపెట్టేందుకే నేషనల్ హెరాల్డ్ పత్రికను తిరిగి ప్రారంభించారని చెప్పారు. అయితే ఈ పత్రిక ద్వారా తమ కుట్రలు బయటపడతాయనే భయంతోనే ఈడీతో కేసులు పెట్టించారని రేవంత్ విమర్శించారు. దేశభక్తిని పెంపొందించడానికి నేషనల్ హెరాల్డ్ ను నడిపించారని రేవంత్ చెప్పారు. ఉద్యోగుల జీతాల కోసం 90 కోట్ల పెట్టుబడులు పెట్టారని..లాభాల కోసం నేషనల్ హెరాల్డ్, యంగ్ ఇండియా సంస్థలు పనిచేయవని తెలిపారు. డబ్బులు చేతులు మారలేదు కాబట్టి ఆర్థికనేరం కింద విచారణ చేయడానికి వీల్లేదని ఈడీ గతంలోనే చెప్పిందని..అయితే కాంగ్రెస్ ప్రజలకు దగ్గర అవుతుందనే ఉద్దేశ్యంతో మళ్లీ ఈడీ కేసులు పెట్టి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను వేధిస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. మోడీ, అమిత్ షా రాక్షసంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లి ఆరోగ్యం బాగోలేని సమయంలో రాహుల్ ను విచారణ పేరుతో అర్ధరాత్రి వరకు ఈడీ ఆఫీసులోనే ఉంచడం మోడీ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజలు బీజేపీ కుట్రలను గమనిస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో వారే ఆ పార్టీకి తగిన సమాధానం చెప్తారని అన్నారు. దేశ చరిత్రలో ఇంత బరితెగించిన ప్రధానిని ఎప్పుడు చూడలేదని.. దేశం కోసం ప్రాణాలను ఇచ్చిన కుటుంబాలను అవమానిస్తున్నారని అన్నారు. ఇదిలావుంటే బ్యాంకులను లూటీ చేసిన నేతలంతా బిజెపిలోనే ఉన్నారనికాంగ్రెస్ సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, జగ్గారెడ్డిలు ఆరోపించారు. రాహుల్ ఈడీ విచారణపై కాంగ్రెస్ సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు. కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే సోనియా, రాహుల్ గాంధీలను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన ఆస్తుల్లో ఒక్క రూపాయి కూడా తీసుకునే హక్కు ట్రస్టు వాళ్లకు లేదని కాంగ్రెస్ నేతలు అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వరుసగా రెండో రోజు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు.. 'కొన్ని దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన చరిత్ర వాళ్లది. రాహుల్ గాంధీ ఈడీ విచారణ దఅష్టా్య పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాం. గాంధీ కుటుంబాన్ని రాజకీయంగా హత్య చేసేందుకు కుట్ర జరుగుతోంది. దేశం కోసం గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసింది. అలాంటి వారు భాజపాలో ఎవరైనా ఉన్నారా? బ్యాంకులను లూటీ చేసిన నేతలంతా బిజెపిలోనే ఉన్నారని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. గాంధీ కుటుంబాన్ని రాజకీయంగా హత్య చేసే కుట్ర జరుపుతోందని పేర్కొన్నారు. అందుకే ఈడీ కేసుల ప్రయోగమని తెలిపారు. నెహ్రూ 16, ఇందిరా 6 సంవత్సరాలు జైలు జీవితాన్ని గడిపారన్నారు. దేశం కోసం గాంధీల కుటుంబాన్ని త్యాగం చేశారన్నారు. మరి బీజేపీలో దేశం కోసం ఒక్కరైనా త్యాగం చేసినవారు ఉన్నారా..? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. స్వాతంత్య్ర ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ బ్రిటీష్‌కి వత్తాసు పలికిందన్నారు. గాంధీని చంపిన గాడ్సేని బీజేపీ నేత ఒకరు పార్లమెంట్‌లో గొప్పవాడు అంటున్నారన్నారు. బ్యాంకులు లూటీ చేసిన నేతలంతా బీజేపీలో ఉన్నారన్నారు. వారి మీద ఈడీ ఉండదా..? అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబానికి తామంతా అండగా ఉంటామని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి భయం పుట్టినప్పుడల్లా గాంధీ కుటుంబంపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం గాంధీలదన్నారు. ఇది ముమ్మాటికీ కక్షసాధింపు చర్య అని వ్యాఖ్యానించారు. ముంబై ఎయిర్పోర్టును ఆదానికి అప్పగించడానికి సీబీఐని ఉపయోగించు కున్నారా? లేదా..? అని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతుకులను బీజేపీ... సీబీఐ, ఈడీతో అణిచివేసే ప్రయత్నం చేస్తోందని పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## విపక్షాల ఉమ్మడి అభ్యర్థిపై నేడు మమత చర్చలు

రాష్ట్రపతి ఎన్నిక కోసం పలువురు సిఎంలు,నేతలకు ఆహ్వానం

విపక్షాల అభ్యర్థిగా తెరపైకి వచ్చిన పవార్ అంతలోనే షాక్

తాను రాష్ట్రపతి ఎన్నికల బరిలో లేనంటూ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ/ముంబై, జూన్ 14 (సమ సమాజం):** రాష్ట్రపతి ఎన్నికల ఉమ్మడి వ్యూహంపై చర్చించేందుకు బుధవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ప్రతిపక్ష సమావేశానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రపతి అభ్యర్థిపై చర్చించనున్నారు. వివిద పార్టీల నేతలు. సిఎంలతో మాఎ ఢిల్లీలో బుధశారం చర్చించనున్నారు. అయితే ఇదే సమయంలో తాను రాష్ట్రపతి రేసులో లేనని మరాఠా నేత శరద్ పవర్ స్పష్టం చేశారు. దేశంలోని అత్యంత సీనియర్ రాజకీయ నాయకులలో ఒకరైన పవార్, గత కొన్ని దశాబ్దాలుగా అనేక సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో, విచ్ఛిన్నం చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఈక్రమంలోరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై శరద్ పవార్ క్లారిటీ ఇచ్చారు. తాను రాష్ట్రపతి రేసులో లేనని చెప్పారు. జులై 18న జరగనున్న రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి విపక్షాల అభ్యర్థిగా శరద్ పవార్ ను నిలబెట్టేందుకు ప్రయత్నించారు. కానీ అనూహ్యంగా ఆయన రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి లేదని చెప్పారు. ఈ విషయంపై ముంబైలో జరిగిన ఓ సమావేశంలో మాట్లాడిన శరద్ పవార్.. రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పారు. రాష్ట్రపతి రేస్ నుంచి పవార్ వెనక్కి తగ్గడంతో విపక్షాలు డైలమాలో పడ్డాయి. ఓడిపోయే పోరులో పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని పలువురు విపక్ష నేతలు అభిప్రాయపడుతున్నారు. భారత రాష్ట్రపతి పదవికి ప్రతిపక్షాల అభ్యర్థిగా బరిలోకి దింపాలనే ప్రతిపాదనను శరద్ పవార్ తిరస్కరించారని ఎన్సీపీ పార్టీ వర్గాల ద్వారా కూడా తెలిసింది. సోమవారం రాత్రి ముంబై నగరంలో జరిగిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) సమావేశంలో శరద్ పవార్ మాట్లాడారని సమాచారం. నేను రాష్ట్రపతి పదవి కోసం రేసులో లేను, రాష్ట్రపతి పదవికి ప్రతిపక్షాల అభ్యర్థిని కాను అని శరద్ పవార్ స్పష్టంగా చెప్పారు. 81 ఏళ్ల కేంద్ర మాజీ మంత్రి అయిన శరద్ పవార్ అధికారికంగా తన తిరస్కరణను కాంగ్రెస్ పార్టీకి తెలియ జేయలేదు. రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాలు అవసరమైన మెజారిటీని సాధించగలవనే నమ్మకం శరద్ పవార్‌కు లేదని ఎన్సీపీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఓడిపోయే పోరులో పోటీచేయడానికి శరద్ పవార్ మొగ్గుచూపడం లేదని ఆయన పార్టీ వర్గీయులు అంటున్నారు. మహారాష్ట్రలో ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లోనూ ప్రతిపక్షాలు దెబ్బతిన్నాయి. శివసేనకు చెందిన సంజయ్ పవార్ ను ఓడించి బీజేపీ రాజ్యసభ సీటు సాధించింది. శివసేన అభ్యర్థికి మద్దతు ఇస్తామని వాగ్దానం చేసిన పలువురు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థిని ఎన్నుకున్నారు. మహారాష్ట్రలోని ఎన్సీపీ మిత్రపక్షాలైన కాంగ్రెస్, శివసేన పార్టీలు రాష్ట్రపతి పదవికి ప్రతిపక్షాల ఏకాభిప్రాయ అభ్యర్థిగా శరద్ పవార్ కావాలని కోరుకుం టున్నాయి. దీనిలో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే సోనియాగాంధీ సందేశంతో ఇటీవల ముంబైలో పవార్ ను కలిసి మాట్లాడారు. ఆమ్ ఆద్మీపార్టీ నేత సంజయ్ సింగ్ కూడా తాజాగా ఎన్సీపీ నేతకు ఫోన్ చేశారు. రాష్ట్రపతి అభ్యర్థి విషయమై మల్లికార్జున్ ఖర్గే శివసేన అధినేత, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌లతో కూడా మాట్లాడారు. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో శివసేనకు చెందిన సంజయ్ పవార్ ను ఓడించి బీజేపీ గట్టి షాక్ ఇచ్చింది. స్వతంత్య్ర ఎమ్మెల్యేలు శివసేనకు మద్దతు ఇస్తామని వాగ్దానం చేసి..చివరి నిమిషంలో బీజేపీ అభ్యర్థికి మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో బీజేపీ తన అభ్యర్థిని గెలిపించుకుంది.

# చలన చిత్రం






## అభిమానుల సందేశాలతో కడుపు నిండింది: నాని

మంచి చిత్రాలు చాలా అరుదుగా వస్తాయి. 'అంటే.. సుందరానికీ' కూడా అరుదైన సినిమానే. ఇలాంటి చిత్రాన్ని మనందరం ముందుకు తీసుకెళ్తే తెలుగు సినిమా వేస్తున్న కొత్త అడుగులో భాగం అవుతాం. ఇది మనందరి సినిమా.. ఇది మనందరి విజయం. మనందరి సెలబ్రేషన్. అంటే.. సుందరానికీ'కి వస్తున్న స్పందన, అభిమానుల సందేశాలు చూస్తుంటే కడుపు నిండిపోయిందని హీరో నాని అన్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో నాని, నజ్రియా నజీమ్ జంటగా నటించిన చిత్రం 'అంటే.. సుందరానికీ'. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజైంది. ఈ సందర్భంగా సోమవారం బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'అంటే.. సుందరానికీ' లాంటి వైవిధ్యమైన కథను ఒప్పుకున్న నానీకి, నిర్మాతలకు థ్యాంక్స్ అన్నారు. జంధ్యాలగారి 'అహ నా పెళ్ళంట, శ్రీవారికి ప్రేమలేఖ' లాంటి క్లాసిక్ సినిమా 'అంటే.. సుందరానికీ'. మా బ్యానర్‌లో ఎప్పటికీ నిలిచిపోయే చిత్రమిది అన్నారు

ఏడాది చిన్నోడిని బుట్టలో వేసుకున్న

# నయన్



ఏడేళ్ల ప్రేమ తర్వాత వివాహ బంధంతో ఒక్కటయ్యారు సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ నయనతార, డైరెక్టర్ విఘ్నేష్ శివన్. ఈ నెల 9న తమిళనాడులోని మహాబలిపురంలో షెరటాన్ గ్రాండ్ హోటల్‌లో వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహనికి సినీ ప్రముఖులు హాజరయ్యారు. నయన్ కి ప్రేమికుడిగా, ఓ దర్శకుడిగా మాత్రమే విఘ్నేష్ అందరికీ సుపరిచితుడు. నయన్‌కి విఘ్నేష్ పెద్ద అభిమాని. అమె కంటే అతను వయసులో ఒక ఏడాది చిన్న కూడా.. విఘ్నేష్ కేవలం దర్శకుడు మాత్రమే కాదు మల్టీ టాలెంటెడ్. పాటల రచయతగా తన సినీ ప్రస్థానాన్ని మొదలుపెట్టి.. తమిళ్ లో 50 కి పైగా పాటలు రాశారు. పలు ఆల్బమ్స్ కి మ్యూజిక్ కూడా చేశాడు. 2012లో శింబు హీరోగా వచ్చిన పోడా పోడి సినిమాకి విఘ్నేష్ కు మొదటిది. అతని రెండో సినిమా అయిన 'నానుమ్ రౌడీదాన్' సినిమాలో తొలిసారి నయన్ నటించింది. ఈ సినిమా చేస్తున్నప్పుడే ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ధనుష్ హీరోగా నటించిన రఘువరన్ బీటెక్ లో విఘ్నేష్ చిన్న పాత్రని పోషించాడు. అతను డిస్ట్రిబ్యూటర్ గా కూడా పలు సినిమాలకి పనిచేశాడు. విఘ్నేష్ కు అనిరుథ్ బెస్ట్ ఫ్రెండ్. విఘ్నేష్ డైరెక్ట్ చేసిన చాలా సినిమాకు అనిరుథ్ సంగీతం అందించాడు. డైరెక్టర్‌గా 'పోడా పోడి'. నానుమ్ రౌడీ దాన్', తానా సెరినా కొట్టం' పావ కాదయిగల్' కాతు వాకుల రెండు కాదల్' వంటి చిత్రాలను డైరెక్ట్ చేశారు. కాతు వాకుల రెండు కాదల్ ఇటీవలే రిలీజ్ అయింది. నయనతార, సమంత హీరోయిన్స్‌గా నటించగా విజయ్ సేతుపతి హీరోగా నటించారు.



## జయం చిన్నది యామిని శ్వేత

విలక్షణ దర్శకుడు తేజ తెరకెక్కించిన అద్భుతమైన ప్రేమకావ్యం జయం. ఇందులోని ప్రతి పాత్రను ఎంతో ప్రత్యేకంగా మలిచాడు డైరెక్టర్ తేజ. ముఖ్యంగా అక్షరాలను తిప్పిరాసే హీరోయిన్ చెల్లెలి పాత్రను ప్రజలు ప్రేమించారు. తన నటనతో నంది అవార్డు గెలుచుకుంది. నేటికి జయం సినిమా వచ్చి 20 ఏళ్లయింది. ఈ సందర్భంగా ప్రస్తుతం యామిని ఎక్కడుంది? ఏం చేస్తుంది? అనేది చూద్దాం.. సీరియల్ ఆర్టిస్ట్ జయలక్ష్మి కూతురే జయం చైల్డ్ ఆర్టిస్ట్ యామిని శ్వేత. చైల్డ్ ఆర్టిస్ట్‌గా మాత్రమే శ్వేత స్క్రీన్‌పై కనిపించాలని ఆమె తల్లిదండ్రులు భావించారు. అందుకే చిన్నతనంలో పలు పాత్రలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ పెద్దయ్యాక మాత్రం హీరోయిన్ కాలేకపోయింది. జయం కంటే ముందే దాదాపు 10 సీరియల్స్ చేసింది. సీతామాలక్ష్మి సీరియల్ చేస్తున్న సమయంలో జయం ఆడిషన్స్ కోసం ప్రకటన వచ్చింది. అది చూసి ఆమె తండ్రి తన ఫొటోలు డైరెక్టర్‌కు పంపారు. అలా హీరోయిన్ చెల్లెలిగా నటించింది. ఉత్సాహం, అనగనగా ఓ కుర్రాడు వంటి సినిమాలు చేశాక చదువుపై దృష్టి పెట్టింది. విదేశాల్లో మాస్టర్స్ చేసి అక్కడే ఉద్యోగం చేసింది. ఆ తర్వాత పెళ్లి చేసుకుని లైఫ్‌లో స్థిరపడిపోయిన ఆమెకు ఓ కూతురు పుట్టింది. ఇకపోతే చదువుకునే సమయంలో బోలెడన్ని ఆఫర్లు వచ్చినా కూడా వాటిని సున్నితంగా తిరస్కరించింది. అందులో నచ్చావులే సినిమా కూడా ఒకటి. ఇక నంది అవార్డుకు వచ్చిన రెమ్యునరేషన్‌ను సైతం మానసిక వికలాంగుల ఆశ్రమానికి దానం చేసి గొప్ప మనసు చాటుకుంది.

## వినోదయచిత్తం రీమేక్‌పై ఊగిసలాట

### పవన్ కళ్యాణ్‌తో అల్లుడు సాయిధరమ్ తేజ్ కాంబినేషన్



పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్, సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ కాంబినేషన్‌లో.. తమిళ సూపర్‌హిట్ చిత్రం 'వినోదయ చిత్తం' రీమేక్ కాబోతోందని ఎప్పటి నుంచో ప్రచారంలో ఉంది. ఈ మూవీపై ఎలాంటి అధికారిక ప్రకటన ఇంతవరకూ రాకపోవడంతో ప్రాజెక్ట్ లేదేమోననే సందేహాలు తలెత్తాయి. అయితే ప్రకటన త్వరలోనే రాబోతోందని, సినిమా పక్కగా ఉంటుందని తాజాగా వార్తలు వినిపిస్తున్నాయి. దాంతో అభిమానుల్లో ఈ సినిమాపై మంచి ఆసక్తినెలకొంది. తమిళ చిత్రాన్ని డైరెక్ట్ చేసిన సముద్రఖని నే ఈ సినిమాని రూపొందిస్తారని టాక్. సోషియో ఫాంటసీ కథాంశంతో సముద్రఖని, తంబిరామయ్య ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ఒరిజినల్ వెర్షన్ ను ఇప్పటికే పలువురు చూడడం మొదలు పెట్టారు. ఇక తెలుగు వెర్షన్‌లో నటించడానికి పవన్ కు 20 రోజులు డేట్స్ సరిపోతాయని అంటున్నారు. అందుకే ఆయన మేనల్లుడు సాయిధరమ్‌తో నటించడానికి ఒప్పుకున్నట్టు సమాచారం. అర్ధంతరంగా చనిపోయిన ఓ ప్రభుత్వ ఉద్యోగి.. ఆత్మ రూపంలో పైకి వెళ్ళిపోతాడు. అక్కడ అతడికి 'టైమ్' అనే వ్యక్తి కనిపిస్తాడు. ఈ టైమ్ లో తను చనిపోవడం చాలా బాధగా ఉందని , భూమ్మీద తను నెరవేర్చాల్సిన పనులు చాలా ఉన్నాయని టైమ్ కు తన గోడును తెలుపుతాడు. దానికి టైమ్ అతడికి మూడు నెలలు టైమిచ్చి.. పని పూర్తి చేసుకు రమ్మని తిరిగి భూమ్మీదకు పంపుతాడు. అప్పుడు ఆ వ్యక్తి ఏం చేశాడు? తన కుటుంబాన్ని ఎలా చక్కదిద్దుకున్నాడు అనేదే 'వినోదయ చిత్తం' మిగతా కథ. ఇందులో టైమ్ గా సముద్రఖని నటించగా.. ప్రభుత్వ ఉద్యోగిగా తంబిరామయ్య నటించాడు. నవ్విస్తూనే ఒక చక్కటి సందేశాన్ని ఈ సినిమాతో ఇచ్చాడు దర్శకుడు. తెలుగు వెర్షన్‌లో సముద్రఖని పాత్రను పవన్ కళ్యాణ్ చేస్తుండగా.. తంబిరామయ్య పాత్రను సాయిధరమ్ తేజ్ చేస్తుండడం విశేషం. ఇక ఈ సినిమాలో కథానాయికగా అందాల కేతిక శర్మ నటించబోతున్నట్టు వార్తలొస్తున్నాయి. 'రొమాంటిక్, లక్ష్య చిత్రాల్లో నటించి గ్లామర్ పరంగా మంచి మార్కులు కొట్టేసిన కేతిక.. ఇప్పుడు మెగా మామా అల్లుళ్ళ చిత్రంలో కథానాయికగా ఛాన్స్ కొట్టేయడం విశేషంగా మారింది. ఆల్రెడీ ఆమె వైష్ణవ్‌తేజ్ సరసన 'రంగరంగ వైభవంగా'చిత్రంలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇలా అన్న దమ్ముల చిత్రాల్లో కథానాయికగా కేతిక నటిస్తుండడం మరీ విశేషం. జూలై సెకండ్ వీక్ లో చిత్రం మొదలు కానుందని అంటున్నారు.

## వేదాళం రీమేక్‌లో చిరుతో నితన్ జట్టు

మెగాస్టార్ చిరంజీవి చిత్రం 'ఆచార్య' అభిమానుల్ని తీవ్రంగా నిరాశపరిచింది. ఈ క్రమంలో ఆయన తదుపరి చిత్రాల విషయంలో మరింత జాగ్రత్తగా అడుగులేస్తున్నారు. ప్రస్తుతం మోహన్ రాజా దర్శకత్వంలో 'గాడ్‌ఫాదర్', మెహర్ రమేశ్ దర్శకత్వంలో 'భోళాశంకర్', బాబీ దర్శకత్వంలో 'వాల్తేరు వీరయ్య' చిత్రాల్లో వరుసగా నటిస్తూ. అభిమానులకు పండగ చేస్తున్నారు. వీటితో పాటు వెంకీ కుడుముల దర్శకత్వంలోనూ ఒక సినిమాను అనౌన్స్ చేశారు చిరు. అయితే చిరంజీవి నటిస్తున్న ఈ సినిమాల ప్రత్యేకత ఏంటంటే.. వీటిలో పేరున్న స్టార్స్ నటిస్తున్నారు. 'గాడ్‌ఫాదర్' లో సత్యదేవ్ కీలక పాత్ర పోషిస్తుండగా.. మరో ప్రధాన పాత్రలో బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ నటిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే.. 'వాల్తేరు వీరయ్య' చిత్రంలో చిరంజీవి తమ్ముడిగా మాస్ మహారాజా రవితేజ కీలక పాత్ర చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తుండగా.. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడనుంది. ఇక వీటితో పాటు మెహర్ రమేశ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'భోళాశంకర్' చిత్రంలో నితిన్ ప్రత్యేక పాత్ర చేయబోతున్నట్టు సమాచారం అందుతోంది. 'భోళాశంకర్' చిత్రంలో చిరంజీవి సరసన మిల్కీ బ్యూటీ తమన్నా కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే చిరు చెల్లెలిగా మహానటి కీర్తి సురేశ్ నటిస్తున్న విషయమూ విదితమే. ఆమెకు జోడీగా నితిన్ నటించబోతున్నట్టు తెలుస్తోంది. ఆల్రెడీ నితిన్, కీర్తి సురేశ్ ఇంతకు ముందు 'రంగ్‌దే' అనే మూవీలో జంటగా నటించారు. అజిత్నటించిన సూపర్ హిట్ తమిళ చిత్రం 'వేదాళం'కు భోళాశంకర్ అఫీషియల్ రీమేక్.





## 20 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో నేర్చుకున్నా

### తన నట ప్రయాణపై నితిన్ ట్వీట్

టాలీవుడ్ టాలెంటెడ్ యంగ్ హీరో నితిన్ 'జయం'చిత్రంతో హీరోగా తన సినీ ప్రయాణాన్ని మొదలుపెట్టి మంచి సక్సెస్ హీరోగా ముద్ర వేసుకున్నాడు. ఆపై సినిమా, సినిమాకి నటనలో ఎంతో పరిపక్వత సాధించి.. తనను తాను మలుచుకున్నాడు. ఆ సినిమా విడుదలై ఇప్పటికి 20 ఏళ్ళయింది. ఇన్నాళ్ళ అతడి నట ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు, ఆటు పోట్లు. వాటన్నిటినీ తట్టుకొని నిలబడి.. హీరోగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టాలీవుడ్‌లో అతడికిప్పుడు మంచి మార్కెట్ ఉంది. ప్రామిసింగ్ డైరెక్టర్స్ తో సినిమాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన రెండు దశాబ్దాల ప్రయాణంపై నితిన్ ఎమోషనల్ గా ట్వీట్ చేశాడు. 20 ఏళ్ళ క్రితం 'జయం' సినిమాతో నా సినీ ప్రయాణం మొదలు పెట్టాను. ఇప్పుడు నాకేం చెప్పాలో మాటలు రావడంలేదు. మొదటగా నన్ను నమ్మి నటునిగా వెండితెరకు పరిచయం చేసిన దర్శకుడు తేజా గారికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. నా మిగతా దర్శకులు, నిర్మాతలు, నటులు టెక్నీషియన్స్.. ఇలా నేను నటించిన సినిమాలకు పనిచేసిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ముఖ్యంగా ఇన్నేళ్ళుగా నన్ను అభిమానిస్తూ, నన్నే ఫాలో అవుతూ చెరగని ప్రేమని అందిస్తున్న అభిమానులకు, వారి ప్రేమకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను'.. అంటూ నితిన్ తన నటన ప్రస్థానంపై ఎమోషనల్ అయ్యారు. నితిన్ ట్వీట్ అభిమానుల్ని ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in